

మగు'వా'

తల్లిగా పిల్లలను కంటికిరెప్పలా కాపాడుతోంది.. ఆలిగా కష్టసుఖాల్లో పాలుపంచుకుంటోంది.. అన్ని బాధ్యతలూ భుజానా వేసుకుని నెరవేరుస్తోంది.. నేనున్నానంటూ భరోసా కల్పిస్తోంది.. శ్రమకు మారుపేరుగా.. ప్రేమకు ప్రతిరూపంగా.. సహనానికి నిదర్శనంగా.. ఆత్మవిశ్వాసానికి నిలువుటద్దంగా.. సాధికారతకు సాక్ష్యంగా నిలుస్తోంది.. సవాళ్లను దీటుగా ఎదుర్కొంటోంది 'ఆమె'.. ఆకాశంలో సగం కాదు అన్నింటా మేమే ముందుంటాం అని నిరూపిస్తున్నారు 'మహిళామణులు'.. ఆర్థిక, రాజకీయ, సామాజిక సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటూ.. ఆయా రంగాల్లో 'రాణి'స్తున్నారు. ఆదర్శంగా నిలుస్తూ.. మగు'వా' అని అనిపించుకుంటున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు.. పలువురి మనోగతాలు..



విధుల్లో భాగంగా కంప్యూటర్ ఆపరేటింగ్ చేస్తున్న సుధ

సుధ.. వైకల్యమే చిన్నబోదా..



పెన్నుతో ఫైలుపై రాస్తున్న సుధ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆత్మవిశ్వాసం ఉండాలేగానీ అంగవైకల్యం అడ్డురాదని నిరూపిస్తోంది ఇంజాపూర్‌కు చెందిన సుధ. చిన్న తనంలోనే రెండు చేతులు కోల్పోయినప్పటికీ కష్టాలను అధిగమించి.. ఆత్మవిశ్వాసమే ఆలంబనగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తూ ఆదర్శంగా నిలిచింది.

ప్రమాదంలో చేతులు కోల్పోయినా..

తుర్కయంజాల్ గ్రామానికి చెందిన దుపాటి సత్యనారయణరాజు నారయణమ్మ దంపతుల కూతురు సుధ చిన్ననాటి నుంచి అల్లారు ముద్దుగా పెరిగింది. నాలుగో తరగతి చదువుతున్న సమయంలో ఓ రోజు అమ్మనాన్నలతో కలిసి మాల్ గ్రామానికి వెళ్లి లారీలో వస్తుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో కిందపడిపోయింది. ఈ ప్రమాదంలో రెండు చేతులకు తీవ్ర గాయాలు కాగా మణికట్టు వరకు తొలగించాల్సి వచ్చింది. అయినప్పటికీ చదువు మాత్రం ఆపలేదు. ఐదో తరగతి నుంచి 9వ తరగతి వరకు పంజాబ్‌లోని కేంద్రీయ విద్యాలయంలో చదివింది. అనంతరం హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయం (తిరుమలగిరి)లో పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పూర్తి చేసింది. భోజిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసింది. కొద్ది రోజులు ప్రైవేటు సెక్టార్‌లో ఉద్యోగం చేసింది. కొంతకాలం సాక్షి టీవీలో న్యూస్‌రీడర్‌గా వాయిస్ ఓవర్ అందించింది.

ఎస్‌బీఐ క్లర్క్ నుంచి అసిస్టెంట్ మేనేజర్ దాకా..

రెండు చేతులు లేవని ఏనాడూ కుంగిపోలేదు సుధ. అనుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేసింది. కష్టపడి చదివి 2013లో బ్యాంక్ క్లర్క్ ఉద్యోగం సాధించింది. అప్పటి నుంచి ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తూనే ఆఫీసర్ పోస్టు కోసం పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించింది. 2023లో అసిస్టెంట్ మేనేజర్‌గా ప్రమోషన్ పొందింది. ప్రస్తుతం ఇబ్రహీంపట్నం ఎస్‌బీఐలో పని చేస్తోంది. రెండు చేతులు పూర్తిగా లేకపోయిన కంప్యూటర్ పరిజ్ఞానం అపారంగా ఉంది. సాధారణ వ్యక్తుల్లాగానే ఉన్న చేతులతోనే చకచకా కంప్యూటర్ ఉపయోగిస్తోంది. పెన్నుతో రాయడం.. ఫైళ్లు తిరగేయడం చేస్తోంది.

వరించిన విజయాలు..

మెగాస్టార్ చిరంజీవి నటించిన స్టాలిన్ సినిమాలో సుధ నటించింది. ఓ ఈటీవీ చానల్ నిర్వహించే స్టార్ మహిళా ప్రోగ్రాంలో పాల్గొని విజేతగా నిలిచింది. మిస్ ఎబిలిటీ కాంటెస్ట్ బ్రాండ్ అంబాసిడర్‌గా పని చేసింది. స్ఫూర్తి అవార్డు, మిస్ హైదరాబాద్ ఐకాన్ అవార్డు అందుకుంది. ప్రస్తుతం పని చేస్తున్న సంస్థలో డిజిటల్ బ్యాంకింగ్ అవార్డును సొంతం చేసుకుంది. విధి నిర్వహణతోపాటు సామాజిక కార్యక్రమాల్లో తనవంతు పాత్ర పోషిస్తూ శభాష్ అనిపించుకుంటోంది.



యునానీ వైద్యురాలు సౌజన్య



మెడికల్ ఆఫీసర్ అనూష



ఎస్ఐగా శిక్షణ పొందుతున్న తేజశ్రీ

ఆ ముగ్గురు.. గెలిచారు.. నిలిచారు

శంకర్‌పల్లి: ముగ్గురు ఆడ పిల్లలున్నా ఆ ఉపాధ్యాయుడు అధైర్య పడకుండా కుమారుడితో సమానంగా వారిని ఉన్నత చదువులు చదివించారు.. ప్రయోజకులను చేశారు.. తల్లిదండ్రుల కష్టాన్ని చూస్తూ పెరిగిన ఆ ముగ్గురూ ఉన్నత స్థానాల్లో స్థిర పడాలని సంకల్పించుకున్నారు.. వారి ఆశయాలకు అనుగుణంగా జీవితంలో ఎదిగారు.. వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట్ మండలం చిట్టిగిద్ద గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సంజీవ రావు, పుష్పరాణి దంపతులకు నలుగురు సంతానం. శంకర్‌పల్లి టీచర్స్ కాలనీలో స్థిర పడ్డారు. పెద్ద కుమార్తె సౌజన్య యునానీ వైద్యురాలిగా శంకర్‌పల్లిలో సొంత ఆస్పత్రి పెట్టుకొని వైద్య సేవలు అందిస్తోంది. రెండో కుమార్తె అనూష మండలంలోని మహాలింగపురంలో మెడికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. మూడో కుమార్తె తేజశ్రీ కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఇటీవల ఎస్ఐ పరీక్షల్లో ఎంపికైంది. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. ఇద్దరు కుమార్తెలకు వివాహం అయింది. వారు కూడా శంకర్‌పల్లిలోనే స్థిర పడ్డారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని తల్లిదండ్రుల కలను సాకారం చేశారు ఆ కూతుళ్లు.

పేదకుటుంబానికి పెద్ద దిక్కయ్యారు



ప్రసన్నలక్ష్మి



శ్రావణి

తలకొండపల్లి: ఆ ఇద్దరు అక్కాచెల్లెళ్లు తమ కుటుంబానికి పెద్ద దిక్క య్యారు. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు చూపిన మార్గంలో పయనిస్తూ.. కుటుంబానికి ఆసరాగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన బండి యాదయ్య, శాంత కుమారి దంపతులు. కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి తొమ్మిది మంది సంతానం. ఏడుగురు ఆడ పిల్లలు, ఇద్దరు మగ పిల్లలున్నారు. మగ, ఆడ అనే తేడా లేకుండా అందరినీ సమానంగా పెంచి విద్యాబుద్ధులు చెప్పించారు. పెద్దమ్మాయి ప్రసన్నలక్ష్మి ఎమ్మెస్సీ పూర్తి చేసి ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తోంది. రెండో కూతురు శ్రావణి బీఎస్సీ నర్సింగ్ చేసి ప్రైవేట్ ఆస్పత్రిలో నర్స్‌గా చేరింది. ఒకమ్మాయికి వివాహం కాగా, మిగతావారంతా బీటెక్, డిగ్రీ, ఇంటర్ చదువుతున్నారు. ప్రసన్నలక్ష్మి, శ్రావణి తమకు వచ్చిన జీతాల్లో ఖర్చులు పోను మిగతా డబ్బులనుఇంటికి పంపిస్తూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. చెల్లెళ్లు, తమ్ముళ్లను చదివిస్తున్నారు. వారికి అవసరమైన పుస్తకాలు, దుస్తులు అందిస్తూ, ఇతరతర సదుపాయాలు సమకూర్చుతున్నారు. పిల్లలిద్దరూ ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఆడపిల్లలైనప్పటికీ ఇంటికి పెద్ద దిక్కుగా మారడంతో తమశ్రమ ఫలించిందని.. చదువు సార్థకమైందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలకు శుభాకాంక్షలు



అన్ని రంగాల్లో ఆకాశమే హద్దుగా రాణిస్తున్న యావత్ మహిళాలోకానికి శుభాకాంక్షలు. మహిళలు గౌరవింపబడిన చోట సుఖశాంతులు వెల్లివిరుస్తాయి. తల్లిలా, చెల్లిలా, భార్యలా ప్రతిఒక్కరి జీవితంలో ఆమె పాత్ర వెలకట్టలేనిది.

– సబితారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే

పురోగతి సాధించాలి



ప్రభుత్వం మహిళల కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత పురోగతి సాధించాలి. గతంతో పోలిస్తే ప్రస్తుతం మహిళలు పోలీసు, రాజకీయ, వైద్యరంగంతో పాటు అన్ని రంగాల్లో రాణించడం సంతోషకరం. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు రాజకీయ రంగంపై ఆసక్తి పెంచుకోవాలి.

– ఎమ్మె శ్రీలత, జెడ్పీటీసీ, కొత్తూరు

అన్ని రంగాల్లో రాణించాలి



తమకు ఆసక్తి ఉన్న రంగాల్లో మహిళలు రాణించాలి. ప్రస్తుతం ప్రభుత్వాలు కూడా మహిళల అభివృద్ధి కోసం ప్రోత్సాహం అందిస్తున్నాయి. పురుషులకు దీటుగా మహిళలు అన్ని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించడం సంతోషకరం.

– అరుంధతి, ఎంపీడీవో, కొత్తూరు

ఆడమగ తేడా వద్దు



నాకు ముగ్గురు కూతుళ్లు. వారిని కొంత వరకు చదివించాను. అంతలోనే భర్త మృతి చెందాడు. చదువును మధ్యలోనే ఆపేసి పిల్లలను వ్యవసాయ పనికి తీసుకెళ్లాను. వ్యసాయంతో పాటు కూలి నాలిచేసి అతి కష్టంగా పెళ్లిళ్లు చేశాను. తల్లిదండ్రులు ఆడపిల్లలను చిన్నచూపు చూడకుండా, మగపిల్లలతో సమానంగా పెంచాలి.

– బేగరి పద్మమ్మ,తిర్మలాపూర్, షాబాద్ మండలం

సంకల్పమే సగం బలం



మహిళలు సహనం, పట్టుదలతో ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోగలరు. ఎలాంటి పనైనా చేయగలను అనే సంకల్పం ఉంటే చాలు ఆ పని సులువుగా పూర్తవుతుందని గుర్తుంచుకోవాలి. ఎంపీపీగా నావంతు బాధ్యత నెరవేరుస్తున్నాను. మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

– కోట్ల ప్రశాంతిరెడ్డి, ఎంపీపీ, షాబాద్

చదివించి.. పెళ్లిళ్లు చేసి



నా భర్త 25 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. నా భర్త బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా పనిచేసేవాడు. ఆయన ఉద్యోగం నేను చేస్తూ ఇద్దరు కూతుళ్లను చదివించాను. వారి పెళ్లిళ్లు చేశాను. నా భర్తలేని లోటు లేకుండా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

– పద్మ, బ్రాంచ్‌పోస్టుమాస్టర్, తాళ్లపల్లి

ఆత్మస్థైర్యం ఉండాలి



ఎన్ని సమస్యలు ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలి. పోరాడి, హక్కులను సాధించుకోవాలి. ఇందుకు ప్రభుత్వం, కోర్టులు ఉన్నాయన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి. నేను ఈ స్థాయికి వచ్చేందుకు మా అమ్మనాన్నల కృషి, ప్రోత్సాహం ఎంతో ఉంది.

– ఆశ్రిత, జూనియర్ పంచాయతీ కార్యదర్శి, నరెడ్లగూడ, షాబాద్

నిక్కచ్చిగా మాట్లాడే తత్వం



రాజ్యాంగం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నా. ఐదేళ్ల పాటు ప్రజలకు సేవ చేసే అదృష్టం దక్కింది. నిక్కచ్చిగా మాట్లాడే గుణం మహిళలకే ఎక్కువ.

– ఉదయశ్రీ, మాజీ సర్పంచ్, నందివనపర్తి

పరిపాలనలో 'రాణి'స్తూ..

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో 40కి పైగా ప్రభుత్వ విభాగాలు ఉండగా, వీటిలో 25పైగా విభాగాల్లో మహిళలే అధిపతులుగా కొనసాగుతుండడం విశేషం. ఇటు కుటుంబాన్ని, అటు ప్రభుత్వ విధులను బ్యాలెన్స్ చేస్తూ ముందుకు సాగుతున్నారు.

ప్రభుత్వ విభాగం	జిల్లా అధికారిపేరు
అదనపు కలెక్టర్	ప్రతిమా సింగ్
డీఆర్ఓ	సంగీత
పరిపాలన విభాగం	ప్రమీల
వ్యవసాయశాఖ	గీతారెడ్డి
మత్స్యశాఖ	సుకీర్తి
ఉద్యానవనశాఖ	కె.నీరజాగాంధీ
మార్కెటింగ్ అధికారి	ఛాయాదేవి
డీసీఓ డిప్యూటీ రిజిస్ట్రార్	ధాత్రిదేవి
బీసీ వెల్ఫేర్	విమలాదేవి
సివిల్‌సప్లయ్	విజయలక్ష్మి
జిల్లా టౌన్‌ప్లానింగ్	సువర్ణదేవి
హ్యాండ్‌లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్	ఇందిరాదేవి
జిల్లా ఉపాధి కల్పన	జి.జయశ్రీ
ఎస్సీ వెల్ఫేర్	రామేశ్వరి
శిశు సంక్షేమశాఖ పీడీ	పద్మజారాణి
జిల్లా క్షయ నియంత్రణ	సీహెచ్ అరుణకుమారి
సీపీఓ	సౌమ్య
డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ వెస్ట్	జి.స్థితప్రజ్ఞ
డీఐఓ ఎన్ఐసీ	స్వర్ణలత గుంటి
లీగల్ మెట్రాలజీ	అనురాధ
సెక్షన్–డి	గిరిజ
డీపీఆర్ఓ	పద్మశ్రీ

ఒక్క ఆడపిల్ల చాలనుకున్నాం..



కుమార్తె శ్రావికతో శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: మాది కడప జిల్లా. మా ఆయన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. చిన్నాన్నకు ఇద్దరూ అబ్బాయిలే. వారు తమకు అమ్మాయిలు లేరని బాధపడుతుండేవారు. అలాంటి సమయంలో నాకు ఒక అమ్మాయి ఉంటే సరిపోతుందని భావించాను. వివాహమైన తర్వాత ఇదే అంశాన్ని నా భర్తకు తెలియజేశాను. ఆయన కూడా ఇందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఆ మేరకు శ్రావిక జన్మించింది. ఆశించినట్లు ఆడబిడ్డ జన్మించడంతో మా సంతోషానికి అవధులు లేవు. మగపిల్లాడికి ఏ మాత్రం తీసిపోని విధంగా పాపను పెంచాం. ఇంజినీరింగ్ చదివించాం. ప్రస్తుతం ఉద్యోగం చేస్తోంది. చాలా సంతోషంగా ఉంది. నా బిడ్డను చూసి నేను గర్వపడుతుంటాను.

– శ్రీవాణి, దిల్‌సుఖ్‌నగర్

టైలర్ నుంచి ఎంపీపీ వరకు



మొయినాబాద్: మహిళలు వంటింటికే పరిమితం కాదని.. అవకాశాలు వస్తే ఏదానై సాధించగలరని నిరూపించింది మొయినాబాద్ ఎంపీపీ నక్షత్రం. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన ఆమె పెళ్లయిన తరువాత టైలర్‌గా ఇంట్లో మిషన్ కుడుతూ కుటుంబానికి ఆసరాగా ఉండేది. ఆమెకు 2001లో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వచ్చింది. సర్పంచ్‌గా పోటీ చేసి విజయం సాధించింది. ఐదేళ్ల పాటు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించింది. పదవిలో ఉన్నా, లేకున్నా కుటుంబ బాధ్యతలు, పిల్లల పోషణ, చదువులను మాత్రం విస్మరించలేదు. 2019 స్థానిక సంస్థల ఎన్నికల్లో చిలుకూరు–2 స్థానం నుంచి ఎంపీటీసీగా పోటీ చేసే అవకాశం వచ్చింది. ఆమెపై ఎవరూ పోటీకి దిగలేదు. ఏకగ్రీవంగా ఎంపీటీసీగా ఎన్నికైన ఆమెకు అనూహ్యంగా మండల పరిషత్ అధ్యక్ష పదవి వచ్చింది. దీంతో నాలుగున్నర సంవత్సరాలుగా ఎంపీపీగా ప్రజా సేవలో తనదైన ముద్ర వేస్తోంది.

ప్రశ్నించే తత్వం పెరగాలి



మహిళల్లో ప్రశ్నించేతత్వం పెరగాలి. భారత రాజ్యాంగం మనకు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశం కల్పించింది. దానిని సద్వినియోగం చేసుకోవాలి. ఎన్నో సమస్యలు, ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోవాలి. ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడే హక్కులను సాధించుకోగలం.

– కొప్పు సుకన్య, ఎంపీపీ, యాచారం

సవాళ్లను అధిగమిస్తూ..



విధి నిర్వహణలో కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించే సమయంలో కొన్ని ఇబ్బందులు తప్పవు. అయినా వాటిని అధిగమిస్తూ.. అందరి సహకారంతో ముందుకు సాగుతున్నాను.

– ఉమారాణి, మండల పంచాయతీ అధికారి

శివపూజకు వేళాయె..



సరూర్‌నగర్ రైతుబజార్ వద్ద పండ్లు కొనుగోలు చేస్తున్న జనం

మహాశివరాత్రికి ఆలయాలు సర్వాంగసుందరంగా ముస్తాబయ్యాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం పర్వదినం సందర్భంగా గురువారం మార్కెట్లలో సందడి నెలకొంది. ఎక్కడ చూసినా పూలు, పండ్లు, పూజాసామగ్రి కొనుగోళ్లలో నిమగ్నమై కనిపించారు.

– హుడాకాంప్లెక్స్

అక్షరాస్యత సాధించాలి



మహిళలు అక్షరాస్యత సాధిస్తేనే కుటుంబాలు బాగుపడుతాయి. ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే మహిళలకు చదువు ఎంతో ముఖ్యం. చదువుకుంటే పాలనాపరమైన అంశాలన్నీ తెలుస్తాయి. ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం ఉంటుంది. ఒకరిపై ఆధారపడాల్సిన పనిలేదు.

– జంగమ్మ, జెడ్పీటీసీ, యాచారం

సేవ చేసే భాగ్యం



రాజ్యాంగం కల్పించిన అవకాశాల ద్వారా ఎంపీటీసీ సభ్యురాలిగా ఎన్నికయ్యాను. ప్రజా సమస్యలపై ప్రశ్నించే అవకాశం దక్కింది. సేవ చేసే భాగ్యం కలిగింది. రాజకీయాల్లో రాణించే విధంగా మహిళలు పోటీ పడాలి.

– తాండ్ర లక్ష్మమ్మ, ఎంపీటీసీ, చింతపట్ల

ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

రాచకొండ సీపీ తరుణ్ జోషి


మహేశ్వరం పీఎస్‌ను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ తరుణ్ జోషి, డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ తరుణ్ జోషి సూచించారు. గురువారం ఆయన డీసీపీ, ఏసీపీలతో కలిసి మహేశ్వరం ఠాణాను సందర్శించారు. ఈ సందర్భంగా సీపీ తరుణ్ జోషి మాట్లాడుతూ.. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అసాంఘిక శక్తులు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి సమాచారం సేకరించాలన్నారు. ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేసేలా సేవలుండాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. శివగంగ రాజరాజేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల నిర్వహణ, రికార్డులు, పట్టుబడిన వాహనాలను పరిశీలించారు. అనంతరం శివగంగా రాజరాజేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, సీఐలు వెంకటేశ్వర్లు, నర్సింహ, సత్యనారాయణ, సుధీర్ కృష్ణ, బబ్యానాయక్ తదితరులున్నారు.

నేడు పాతబస్తీ మెట్రోకు శంకుస్థాపన

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీ మెట్రో రైల్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు శంకుస్థాపన చేయనున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఆధ్వర్యంలో ఫలక్‌నుమా వద్ద జరుగనున్న ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొంటారు. నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య ప్రయాణ సౌకర్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం సుమారు 75 కిలో మీటర్ల వరకు మెట్రో రెండోదశ విస్తరణ చేపట్టిన సంగతి తెలిసిందే. మెట్రో మొదటి దశలోనే జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ఫలక్‌నుమా వరకు పూర్తి చేయాల్సిన గ్రీన్ లైన్ పనులు ఎంజీబీఎస్ వరకే పరిమితమయ్యాయి. దీంతో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మిగిలిన 5.5 కిలోమీటర్ల మార్గాన్ని ప్రస్తుత రెండో దశలో పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పాతబస్తీ మెట్రో పనులను ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించనున్నారు. పాతబస్తీ అలైన్‌మెంట్ దారుల్‌షిఫా, పురానీహవేలీ, ఏతేబార్‌చౌక్, అలీజాకోట్ల, మీర్ మోమిన్ దయరా, హరిబౌలి, శాలిబండ, శంషీర్‌గంజ్, ఆలియాబాద్‌ల నుంచి ఫలక్‌నుమా వరకు ఉంటుందని హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు.

బోగస్ ఓట్లపై 'నజరీ నక్షా'

- మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లిలో అధికం
- హైకోర్టును ఆశ్రయించిన బీజేపీ అభ్యర్థి కొండా
- ఇంటి నంబర్ల వారీగా గ్రాఫికల్ మ్యాప్‌లు ఇవ్వాలని కోర్టు తీర్పు
- బోగస్ ఓటర్లను గుర్తించే పనిలో బూత్‌స్థాయి కేడర్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలో బోగస్ ఓట్ల అంశంపై మళ్లీ తెరపైకి వచ్చింది. ఎన్నికల్లో ఎలాగైనా గెలిచేందుకు కొంత మంది అభ్యర్థులు ఓటర్ల నమోదు ప్రకియలోని లొసుగులను అడ్డుపెట్టుకుని అడ్డదారులు తొక్కుతున్నారు. ఒకే ఇంటి నంబర్‌పై వందల సంఖ్యలో బోగస్ ఓట్లను నమోదు చేయిస్తున్నారు. ఓటర్ కార్డుకు ఆధార్‌కార్డు అనుసంధానం తప్పనిసరి కాకపోవడం, బోగస్ ఓటర్లను గుర్తించి, జాబితా నుంచి తొలగించేందుకు అవసరమైన వ్యవస్థ ఎన్నికల కమిషన్ వద్ద లేదు. ఇదే వీరికి కలిసి వస్తోంది. ప్రభుత్వ భూముల్లో చేపట్టిన నిర్మాణాలకు ఇంటి నంబర్లు లేకపోవడం, ఇక్కడ నివసిస్తున్న వారికి ఓటు హక్కు తప్పనిసరి చేయడంతో వీరికి అనుకూలంగా మలుచుకుంటున్నారు. స్థానికంగా ఉన్న కొంత మంది లీడర్లు తమకు అనుకూలమైన వర్గం నుంచి దరఖాస్తులు పెద్దఎత్తున సేకరించి, వాటిపై సమీపంలోని ఇంటి నంబర్లను వేసి ఓటు హక్కు కల్పిస్తున్నారు. ఇలా ఒక్కో ఇంటిపై వందల సంఖ్యలో ఓట్లు నమోదవుతున్నాయి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించే పక్కా వ్యవస్థ ఎన్నికల కమిషన్ వద్ద లేకపోవడం, ప్రతీ చిన్న పనికి క్షేత్రస్థాయి రెవెన్యూ, ఇతర ప్రభుత్వ యంత్రాంగంపైనే ఆధారపడాల్సి రావడం అక్రమార్కులకు కలిసి వస్తున్న అంశం.

ఆ మూడు నియోజకవర్గాల్లో అధికం

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో జిల్లాలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, చేవెళ్ల సహా వికారాబాద్, పరిగి, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. షాద్‌నగర్, కొడంగల్ నియోజకవర్గాలు మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానం పరిధిలో ఉండగా, కల్వకుర్తి నియోజకవర్గం నాగర్‌కర్నూల్ లోక్‌సభా స్థానం పరిధిలో కొనసాగుతోంది. ఇక ఇబ్రహీంపట్నం నియోజకవర్గం భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఉండగా, ఎల్బీనగర్ నియోజకవర్గం మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం పరిధిలో కొనసాగుతోంది. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు ఉండగా, మొత్తం 29,14,124 మంది ఓటర్లున్నారు. వీరిలో 14,93,369 మంది పురుషులు, 14,20,469 మంది మహిళలు ఉన్నారు. మరో 286 మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. ముఖ్యంగా మహేశ్వరం, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో బోగస్ ఓటర్లు ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. స్థానికంగా లేని వారి ఓట్లతో పాటు చనిపోయిన వారి ఓట్లను తొలగింపు, బోగస్ ఓట్ల గుర్తింపులో జిల్లా ఎన్నికల కమిషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడి నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థుల నడుమ ట్రయాంగిల్ ఫైట్ ఉంటుంది. ఇప్పటికే కొంతమంది బోగస్ ఓట్లను నమోదు చేయించినట్లు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులందాయి. సమయంలో పోలింగ్ బూత్‌ల వారీ గా నజరీ నక్షాలను అందజేయాల్సిందిగా కోరుతూ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించడం, ఆయనకు అనుకూలంగా తీర్పు రావడంతో ప్రస్తుతం నజరీనక్ష అంశం చర్చనీయాంశంగా మారింది.

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్లు
మహేశ్వరం	511	2,84,913	2,70,996	69
రాజేంద్రనగర్	535	3,10,863	2,88,684	38
శేరిలింగంపల్లి	622	3,95,460	3,52,069	144
చేవెళ్ల	298	1,35,261	1,33,820	06
పరిగి	269	1,33,625	1,32,639	09
వికారాబాద్	284	1,15,019	1,16,647	13
తాండూరు	269	1,18,228	1,25,614	07

ఏమిటీ నజరీ నక్షా ?

ఓటింగ్‌కు ముందు ఎన్నికల కమిషన్ తుది ఓటర్ల జాబితా ముద్రిస్తుంది. ఈ సమయంలో పోలింగ్ బూత్‌ల వారీగా జియో గ్రాఫికల్ మ్యాప్‌లను రూపొందిస్తుంది. పోలింగ్ బూత్ పరిధిలో వచ్చే కాలనీలు, బస్తీలు, ఇంటి నంబర్లు, ఓటర్ల వివరాలు ఇందులో పొందుపరుస్తారు. దీని ఆధారంగా అసలు ఓటర్లను గుర్తించడం సులభమవుతుంది. నిజమైన ఓటరుకు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుంది. పోలింగ్ బూత్‌ల వారీగా ఆయా పార్టీల ఏజెంట్లకు ఈ నజరీ నక్షలను ముందే అందజేయడం ద్వారా ఓటింగ్‌లో పారదర్శకత పెంచొచ్చు. తెలంగాణ చరిత్రలో ఇప్పటి వరకు నజరీ నక్షల కోసం కోర్టును ఆశ్రయించిన వారు లేరు. తాజాగా చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఇదే అంశంపై హైకోర్టును ఆశ్రయించడం, ఆయనకు అనుకూలంగా తీర్పు రావడం చర్చనీయాంశంగా మారింది.

ప్రభుత్వ భూములకు రక్షణ అవసరం

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో హద్దులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి
- కలెక్టర్ శశాంక


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాలకు గురికాకుండా చూడాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. గురువారం ఆయన జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో కందుకూరు డివిజన్ పరిధిలోని చెరువులు, ప్రభుత్వ భూములు పై ఆర్డీఓ, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సర్వే ల్యాండ్ అధికారులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కందుకూరు డివిజన్‌లోని చెరువులు కబ్జాలకు గురి కాకుండా ఎఫ్‌టీఎల్, బఫర్లను గుర్తించాలన్నారు. ఆక్రమణల నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైతే పోలీసుల సహకారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించే బాధ్యత మనపైనే ఉన్నందున చెరువులను జాయింట్ సర్వే నిర్వహించి రాతి కడీలను, సూచిక బోర్డులను ఏర్పాటు చేస్తే ఫలితముంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పని చేయాలని ఆదేశించారు. సంబంధిత అధికారులంతా సమష్టిగా పని చేసినప్పుడే ప్రభుత్వ భూములను, చెరువులను కబ్జాచెరనుంచి కాపాడగలమన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఆర్డీఓ సూరజ్ కుమార్, తహసీల్దారులు, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సర్వేల్యాండ్ అధికారి శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు

నిష్పత్తికి మించి ఓటర్లున్న పోలింగ్ బూత్‌ల పరిధిలో సహాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ చెప్పారు. ఈ మేరకు గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలింగ్ కేంద్రాల్లో 1500 మించి ఓటర్లుంటే సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతిపాదించిన సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, లొకేషన్ల మార్పు వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఈ పోలింగ్ కేంద్రాల పై సందేహాలుంటే చెప్పాలని కోరారు. పార్లమెంటు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ, బీఎస్పీ, ఎంఐఎం రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గ్యారంటీలకు ఆకర్శితులై చేరికలు

వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి


కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. గురువారం జెడ్పీటీసీ మాజీ సభ్యులు కంజర్ల భాస్కర్, చంద్రలింగంగౌడ్, మాజీ ఎంపీపీ మోహన్‌గౌడ్ ఇతర పార్టీల నాయకులతో కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్, పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ ఆధ్వర్యంలో సునీతారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు ఆకర్శితులై వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి, మత్స్యకార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ముదిరాజ్, ఫిషర్‌మెన్ మండల అధ్యక్షుడు భిక్షపతి, మల్లేశ్, నాయకులు అనంతరెడ్డి, కంజర్ల శేఖర్, రమేశ్‌ముదిరాజ్, దాస్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తి అదృశ్యం


గోపాలకృష్ణ (ఫైల్)

మీర్‌పేట: పనికోసం వచ్చిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా సింగరాయపల్లిగూడెంకు చెందిన కుర్ర గోపాలకృష్ణ(36) వృత్తిరీత్యా డ్రైవర్. ఈ నెల 2న గోపాలకృష్ణ సోదరుడు రాజుతో కలిసి డీసీఎంలో పండ్ల లోడ్‌తో బాలాపూర్ చౌరస్తాకు వచ్చాడు. అనంతరం గోపాలకృష్ణ తన సెల్‌ఫోన్‌ను డీసీఎంలోనే పెట్టి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ అన్ని ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించక పోండంతో కుటుంబ సభ్యులు గురువారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారులకు పబ్లిక్ సెలవులు రద్దు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాల పనులను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ పరిధిలోని అధికారులు, తహసీల్దార్లు, సూపరింటెండెంట్లు, సిబ్బంది ఈ నెల 8, 9, 10 తేదీల్లో పబ్లిక్ సెలవులను ఉపయోగించుకోవద్దని గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తులకు గాయాలు

శంకర్‌పల్లి: యూటర్న్ చేస్తున్న బైక్‌ను కారు(ఎలక్టిక్) ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. నగరంలోని ఫలక్‌నుమా ప్రాంతానికి చెందిన చెన్నయ్య, సయ్యద్ మహ్మద్ బైక్‌పై శంకర్‌పల్లి వైపు ప్రయాణిస్తున్నారు. శంకర్‌పల్లి–హైదరాబాద్ రోడ్డులోని బంగారు మైసమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డు వద్ద బైక్‌ను యూటర్న్ చేస్తుండగా శంకర్‌పల్లి–నార్సింగి ప్రయాణిస్తున్న కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో చెన్నయ్య ఎడమ చేయి, సయ్యద్ మహ్మద్ కాలు ఫ్యాక్చరయ్యాయి. కారులో వెళ్తున్న ఇండస్ పాఠశాల విద్యార్థులు సీట్ బెల్ట్ ధరించడంతో ఎయిర్ బెలూన్స్ ఓపెన్ అయి ప్రమాదం నుంచి బయటపడ్డారు. కారు డ్రైవర్ స్పృహ తప్పడంతో ఆస్పత్రికి తరలించారు. చెన్నయ్య భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

11 నుంచి కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వరరావు

తుర్కయంజాల్: ఈ నెల 11 నుంచి 24 వరకు జిల్లా వ్యాప్తంగా పట్టణ ప్రాంతాలు, అన్ని గ్రామాల్లో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమం చేపట్టనున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన జిల్లా కార్యాలయంలో లెప్రసీ డిటెక్షన్ క్యాంపెయిన్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, లెప్రసీ నోడల్ పర్సన్స్, డిప్యూటీ పారామెడికల్ అధికారులతో ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పట్టణాలు, గ్రామాల ఆశ కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి, ఇంట్లోని కుటుంబ సభ్యులందరికీ లెప్రసీ వ్యాధి లక్షణాల పరీక్షలు చేసిన అనుమానం ఉన్నవారిని ఉన్నత పరీక్షల కోసం వైద్యాధికారుల వద్దకు పంపిస్తామని వివరించారు. కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో ఇప్పటికి అపోహలున్నాయని, వీలైనంత తొందరగా వ్యాధిని గుర్తించి, సరైన చికిత్స అందిస్తే సులువుగా వ్యాధి నయం సాధ్యమవుతుందన్నారు. అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ అరుణ మాట్లాడుతూ.. ఈ వ్యాధి మైక్రో బాక్టీరియమ్ లెప్రే అనే బాక్టీరియా వల్ల ఒకరి నుంచి మరొకరికి సోకుతుందన్నారు. శరీరంపై గోధుమ రంగు, రాగి రంగులో స్పర్శ లేని మచ్చలు ఏర్పడుతాయని తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వచ్చే ఆశ కార్యకర్తలకు పూర్తిగా సహకరించి, వ్యాధి నిర్మూలనకు తోడ్పాటు అందించాలని కోరారు.